సాక్షి ఒడిశా

శనివారం । 9 । ఆగస్టు । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,53,213లు, బంగారం 4గ్రాముల 650 మిల్లీగ్రాము, వెండి 5గ్రాముల 750మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

విచిత్రం.. విభిన్నం.. -8లో ▶



ఆదివాసీ గిరిజనులకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే మలక్‌నగిరి జిల్లాలో బోండా జాతి గిరిజనులు ప్రత్యేకంగా నిలుస్తుంటారు. సముద్ర మట్టానికి సుమారు ఐదు వేల అడుగుల ఎత్తులో జీవిస్తున్నారు.

బాబోయ్ పులి!



సుందర్‌గఢ్ జిల్లా లెఫ్రిపడా అటవీ ప్రాంతంలో పెద్ద పులి సంచరిస్తుండటంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. -8లో ▶

న్యూస్‌రీల్

రాష్ట్ర శాసనసభ కొత్త వెబ్‌సైట్ ప్రారంభం



కొత్త వెబ్‌సైట్ ప్రారంభించిన శాసన సభ స్పీకరు సురమా పాఢి

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభ కొత్త వెబ్‌సైట్ - assembly.odisha.gov.inను స్పీకర్ సురమా పాఢి శుక్రవారం ప్రారంభించారు. తాజా సాంకేతిక పరిజ్ఞానంతో రాష్ట్ర శాసన సభకు సంబంధించిన సమగ్ర సమాచారంతో దీనిని పునరుద్ధరించారు. కొత్త వెబ్‌సైట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శాసన సభ వ్యవహారాల మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్, విభాగం కార్యదర్శి సత్య బ్రత రౌత్ పాల్గొన్నారు. రాష్ట్ర పౌరులకు శాసనసభ పనితీరును చేరువ చేయడంలో ఇది ఒక ముందడుగు అని రౌత్ పేర్కొన్నారు. ఈ వేదిక ద్వారా, శాసన సభ వ్యవహారాలు, కార్యకలాపాలు, చర్చలు, సభ్యుల వివరాలు, వివిధ నివేదికలకు సంబంధించిన సత్వర, కచ్చితమైన సమాచారాన్ని అందజేయడం ఈ వెబ్‌సైట్ లక్ష్యమని తెలిపారు. ఇది శాసన సభ సభ్యులకే కాకుండా పరిశోధకులు, విద్యార్థులు, మీడియా, సాధారణ ప్రజలకు కూడా విలువైన వనరుగా ఉపయోగపడుతుందని చెప్పారు.

నిత్యావసరాలు పంపిణీ



మహిళలకు నిత్యావసరాలు అందజేస్తున్న నళిని

రాయగడ: స్థానిక రైతుల కాలనీలో నవజీవన్ ట్రస్టు ఆధ్వర్యంలో నిరుపేదలైన 40 మంది ఆదివాసీ వృద్ధ మహిళలకు నిత్యావసర వస్తువులను శుక్రవారం పంపిణీ చేశారు. బియ్యం, కందిపప్పు, బంగాళదుంపలు, నూనె వంటి నిత్యావసర వస్తువులను ప్రతీ నెల నిరుపేదలకు ట్రస్టు తరపున పంపిణీ చేస్తున్నామని నిర్వాహకురాలు ఎం.నళిని తెలిపారు. అలాగే ట్రస్టు ఆధ్వర్యంలో వంద మందికి పైగా ఆదివాసీ, అనాథ విద్యార్థులను చదివిస్తున్నట్టు పేర్కొన్నారు.

పట్టుబడిన పేకాటరాయుళ్లు

జయపురం: స్థానిక దాసర వీధిలో జరుగుతున్న పేకాట శిబిరంపై జయపురం పోలీసులు దాడి చేశారు. ఐదుగురు పేకాటరాయుళ్లను పట్టుకుని వారి వద్ద నుంచి రూ.10,500 స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో ఆర్.నాయిక్, ఎం.ఖౌర, ఎస్.సాగొడియ, ఎం.ఎన్.కుమార్, బి.హంతాల్ ఉన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

భువనేశ్వర్: స్థానిక బారిముండా ప్రాంతంలో యువకుడి అనుమానాస్పద మరణం కలకలం రేపుతోంది. మంచేశ్వర్ ఠాణా పోలీసులు ఘటనా స్థలం చేరుకుని ఫ్యాన్‌కు వేలాడుతున్న మృతదేహం స్వాధీనపరచుకుని శవ పరీక్షల కోసం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతుడు కన్హా బారిక్‌గా గుర్తించారు. ఏడాదిన్నర క్రితం ధౌలి ప్రాంతంలో వివాహం చేసుకున్నాడు. భార్య వేధింపులు తాళలేక ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటాడని స్థానికులు చెబుతున్నారు.


మహిళపై డెలివరీ బాయ్ దాడి

భువనేశ్వర్: నగరంలో మహిళపై డెలివరీ బాయ్ దాడి చేయడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. స్థానిక భరత్‌పూర్ ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఫుడ్ డెలివరీ సమయంలో ఇద్దరి మధ్య ఘర్షణ ఈ వివాదానికి దారి తీసినట్లు ప్రాథమిక సమాచారం. డెలివరీ బాయ్ దాడిలో మహిళ తీవ్రంగా గాయపడింది.

పోలీసుల కథనం ప్రకారం నిందితుడు ఆన్‌లైన్‌లో బుక్ చేసిన ఆహారం అందించేందుకు వెళ్లిన సందర్భంగా మహిళతో సంభాషణ సమయంలో వివాదం చెలరేగింది. నిందితుడు ఆమెను పదునైన గిన్నెతో కొట్టడంతో తల, మెడ, చేయిపై బలమైన గాయాలయ్యాయి. బాధితురాలు స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. భరత్‌పూర్ ఠాణా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని పట్టుకోవడానికి గాలిస్తున్నారు.



ట్రాక్ మధ్యలో ఇరుక్కుపోయిన బండరాయి



దెబ్బతిన్న ఎక్స్‌ప్రెస్ రైలు ఇంజిన్ ముందుభాగం



ట్రాక్ మరమ్మతులు చేపడుతున్న రైల్వే సిబ్బంది

తప్పిన ముప్పు

- కోర్బా ఎక్స్‌ప్రెస్‌కు త్రుటిలో తప్పిన ప్రమాదం
- ట్రాక్ మధ్యకు జారిపడిన బండరాయి
- నిలిచిన రైలు.. సురక్షితంగా ప్రయాణికులు

రాయగడ : విశాఖపట్నం నుంచి రాయగడ మీదుగా వెళ్లే కోర్బా ఎక్స్‌ప్రెస్‌కు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. స్థానిక మజ్జిగౌరి మందిరానికి సమీపంలో ఓ బండరాయి ట్రాక్ మధ్యలో జారిపడటంతో దానిని ఢీకొన్న రైలు కొద్ది దూరం వరకు బండరాయిని ఈడ్చుకుంటూ పోయింది. దీంతో రైలును సుమారు 5 గంటల పాటు నిలిపివేశారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం వాటిల్లకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే.. విశాఖపట్నం నుంచి కోర్బాకు వెళ్లే లింక్ ఎక్స్‌ప్రెస్ శుక్రవారం అర్ధరాత్రి పన్నెండు గంటల సమయంలో రాయగడ సమీపంలోని మజ్జిగౌరి మందిరానికి కొద్ది దూరం వచ్చేసరికి పెద్ద బండరాయి ట్రాక్ మధ్యలోకి వచ్చిపడింది. దీంతో వేగంగా వస్తున్న ట్రైన్ బండరాయిని ఢీకొనడంతో ఇంజిన్ ముందు భాగం దెబ్బతింది.

అనంతరం రాయి ట్రాక్ మధ్యలో ఇరుక్కుపోవడంతో రైలు నిలిచిపోయింది. వెంటనే ట్రైన్ డ్రైవర్ దిగి వెళ్లి చూడటంతో బండరాయి అడ్డంగా పడినట్లు గుర్తించారు. ట్రాక్ పూర్తిగా దెబ్బతినడంతో రైలును సుమారు 5 గంటల పాటు నిలిపివేశారు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు, ఇంజినీరింగ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని యుద్ధ ప్రాదిపదికన ట్రాక్ మరమ్మతులు చేపట్టారు. ఈ నేపథ్యంలో రాయగడ మీదుగా విశాఖపట్నం వైపు వెళ్లే పలు రైళ్లను రెండో నంబరు ట్రాక్ మీదుగా తరలించారు. మరమ్మతులు పూర్తి కావడంతో రాకపోకలు మళ్లీ యథాతథంగా కొనసాగాయి.



బండరాయి పడటంతో నిలిచిన కోర్బా ఎక్స్‌ప్రెస్

కొరియాలో డిప్యూటీ సీఎం పర్యటన



సిమిలిగుడ కళాశాల వార్షికోత్సవ వేదికపై డీసీఎం ప్రభాతి, మంత్రులు, ఎమ్మెల్యేలు

కొరాపుట్: ఆంధ్ర–ఒడిశా వివాదాస్పద ప్రాంతం కొఠియాలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా పర్యటించారు. శుక్రవారం కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి కొఠియా గ్రామ పంచాయతీలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. కొఠియా పంచాయతీ ఇంత వరకు 1,800 మంది మహిళలకు సుభద్ర యోజన కింద రు.5000 చొప్పున రెండు సార్లు అందించామని చెప్పారు. మరో 240 మందికి సాంకేతిక కారణాల వల్ల అందలేదన్నారు. వారికి కూడా శనివారం విడుదలయ్యే మూడో విడత సుభద్ర నిధులు అందుతాయన్నారు. వీరికీ మొత్తం 3 వాయిదాలు కలిపి రూ.1,500 చొప్పున అందుతుందన్నారు. మొత్తం కొఠియా పంచాయతీలో 24 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ పర్యవేక్షణ జరుగుతుందన్నారు. శనివారం రు.5000 కోట్లను రాష్ట్ర ముఖ్యమంత్రి విడుదల చేస్తారన్నారు. ఈ నిధులు 3వ విడత సుభద్ర పథకం క్రింద జయపూర్ కేంద్రంగా విడుదల అవుతాయని చెప్పారు. అంతకు ముందు కుందిలి సంతలో కూరగాయలు విక్రయిస్తున్న గిరిజన మహిళలతో సంభాషించారు. సిమిలిగుడ కళాశాల 40వ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. సునాబెడాలో పెద్ద ఎత్తున్న మహిళలను డీసీఎంకు స్వాగతం పలికారు. ఉదయం భువనేశ్వర్ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి జయపూర్ వచ్చారు. రాష్ట మంత్రులు నిత్యానంద గోండో, ముఖేష్ మహాలింగ్‌లు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రఘురాం మచ్ఛో, రుపుదర్ బోత్ర తదితరులు పాల్గొన్నారు.



సునాబెడలో డీసీఎం ప్రభాతి పరిడాకి స్వాగతం పలుకుతున్న మహిళలు

పరుగు పందెంలో అపశృతి

- రన్నింగ్ చేస్తూ కుప్పకూలిన హోమ్‌గార్డ్ అభ్యర్థి

భువనేశ్వర్: ఖుర్దా జిల్లాలో హోమ్ గార్డు నియామకం కోసం నిర్వహించిన శారీరక పరీక్ష నిర్వహణలో విచారకర సంఘటన చోటు చేసుకుంది. ఖుర్దా ప్రాంతం తొరొతువా రిజర్వ్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన శారీరిక దారుఢ్య నిర్ధారణ పరీక్షలో పాల్గొన్న అభ్యర్థి మృతి చెందాడు. మృతుడు ఖుర్దా జిల్లా కెరంగ ప్రాంతానికి చెందిన 40 ఏళ్ల అమదుల్ హక్‌గా గుర్తించారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. అమదుల్ హక్ పరీక్ష ప్రాంగణంలో రన్నింగ్ చేస్తూ అకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. అతడు స్పృహ తప్పి పోయినట్లు గుర్తించి తక్షణమే చికిత్స కోసం భువనేశ్వర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడికి చేరుకునే లోపే అతను మరణించాడని వైద్యులు ప్రకటించారు. నియామక ఎంపిక కేంద్రాల్లో తగిన వైద్య సదుపాయాలు అందుబాటులో లేకపోవడం, సకాలంలో చికిత్స అందక హోమ్ గార్డు అభ్యర్థి మృతి చెందాడని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు.

18న బర్‌గఢ్‌లో
బీజేడీ రైతుర్యాలీ

భువనేశ్వర్ : భారతీయ జనతా పార్టీ నేతృత్వంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రాష్ట్రంలో అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 18న పశ్చిమ ఒడిశా బర్‌గఢ్‌లో విపక్ష బిజూ జనతా దళ్ (బీజేడీ) భారీ రైతు ర్యాలీ నిర్వహించనుంది. ఈ మేరకు స్థానిక శంఖభవన్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. బీజేడీ అధికారంలో ఉన్నప్పుడు రైతుల నమోదు ప్రక్రియ చాలా సరళంగా ఉండేది. ఈ వ్యవస్థని క్లిష్టంగా తీర్చిదిద్దడంతో రైతాంగం వర్ణనాతీతమైన ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారు. రైతులు పండించిన వరిని అమ్మడానికి స్వయంగా నమోదు చేసుకోలేక సతమతమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు నమోదు కోసం కొత్త నియమాలను రూపొందించింది. దీంతో తక్కువ మంది రైతులు నమోదు చేసుకోగలుగుతున్నారు. ఈ లెక్కన తక్కువ మందికి పెట్టుబడుల రాయితీ పరిమితమై అత్యధిక రైతాంగం నష్టానికి గురవుతున్నారని బీజేడీ ఆరోపిస్తోంది. గత ఏడాది రాష్ట్రంలో వ్యవసాయం దిగజారింది. వ్యవసాయ రంగంలో వృద్ధి రేటు 3.8 శాతానికి పడిపోవడం పట్ల విపక్షం ఆందోళన వ్యక్తం చేసింది. ఉభయ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఎన్నికల హామీలను విస్మరించి రైతులను నిలువునా దోచుకుంటున్నాయని,. రాష్ట్ర ప్రభుత్వం చర్యలతో వ్యవసాయ రంగానికి కేంద్ర సహాయం 18.19 శాతం తగ్గిందని బీజేడీ పేర్కొంది.

త్వరితగతిన ఆడిటోరియం పునర్నిర్మాణ పనులు

జయపురం: జయపురం పాత ఫైర్ స్టేడియం, గుర్రాల శాల మైదానంలోని ప్రతాప్ నారాయణ సింగ్ దేవ్ ఆడిటోరియం పునర్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జయపురం సబ్‌కలెక్టర్, మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారిణి అక్కవరం శౌశ్య రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆడిటోరియం పునఃనిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. అయితే పనులు నత్తనడకలా సాగుతున్నట్టు గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు ఈ నెల 15వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. 25 ఏళ్ల కిందట ఆఖరి జయపురం మహారాజు రామకృష్ణ దేవ్ సోదరులు, మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ ప్రతాప్ నారాయణ సింగ్ దేవ్ పేరుతో స్టేడియం నిర్మించారు. అతి విలువైన కుర్చీలు ఇతర సామగ్రితో అందంగా తీర్చిదిద్దారు. కొంత కాలం బాగా నడిచిన ఆడిటోరియం అధికారుల నిర్లక్ష్యం కారణంగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో విలువైన వస్తువులు చోరీకి గురయ్యాయి. దీంతో స్టేడియాన్ని పునర్ నిర్మాణం చేసేందుకు రెండేళ్ల కిందట మున్సిపాలిటీ టెండర్లు ఆహ్వానించి కాంట్రాక్టర్‌కు పనుల అప్పగించారు. అయితే పూర్తికాకపోవడంతో సబ్ కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సకాలంలో పనులు పూర్తిచేయాలని కంట్రాక్టర్‌ను ఆదేశించారు. పనులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వెంటనే పూర్తి చేయించాలని మున్సిపల్ జూనియర్ ఇంజినీర్‌కు సూచించారు. పరిశీలనలో మున్సిపల్ సహాయ కార్యనిర్వాహక అధికారిణి పూజ రౌత్, ఇంజినీర్ చైతన్య బాసికే, మున్సిపల్ ఉద్యోగులు సత్యనారి యణ పాత్రో, దేవ ప్రసాద్ మహంతి ఉన్నారు.



ఆడిటోరియాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అక్కవరం శౌశ్య రెడ్డి



పనులపై సమీక్షిస్తున్న సబ్‌కలెక్టర్ తదితరులు

డీజీపీ కార్యాలయ ఆవరణలో కాంగ్రెస్ నిరసన

భువనేశ్వర్: రాష్ట్రంలో మహిళలపై పెరుగుతున్న నేరాలు, వేధింపులు, అత్యాచారాలు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలకు నిదర్శనంగా నిలుస్తున్నాయని కాంగ్రెసు పార్టీ నాయకులు ఆరోపించారు.

ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర పోలీసు డైరెక్టరు జనరల్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు విఫల యత్నం చేశారు. ఈ ఆందోళనలో అనేక మంది సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. పీసీసీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలో భాగంగా మాతా మఠ్ నుంచి డీజీపీ కార్యాలయం వరకు శాంతియుతంగా పాదయాత్ర నిర్వహించారు. కాంగ్రెసు కార్యకర్తల నిరసనను దృష్టిలో ఉంచుకుని 15 ప్లాటూన్ల పోలీసు బలగాలను మోహరించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం 70 మంది సీనియర్ పోలీసు అధికారులను ప్రత్యేకంగా నియమించారు.

కుట్టుశిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మనోజ్ సత్యభాను మహాజన్

- కొరాపుట్ జిల్లా కలెక్టర్ మనోజ్ సత్య భాను మహాజన్

జయపురం: కుట్టు శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొరాపుట్ జిల్లా కలెక్టర్ మనోజ్ సత్యభాను మహాజన్ కోరారు. జయపురం సబ్‌డివిజన్ కొట్పాడ్ మిరిగన్‌లో కుట్టు శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొట్‌పాడ్‌లో చేనేత వస్త్ర పరిశ్రమ ఎంతో పేరుగాంచిందన్నారు. కొట్‌పాట్ నేయబడుతున్న వస్త్రాలతో మిరగన్ వస్త్ర ఉత్పత్తులు చేసి మార్కెటింగ్ ద్వారా వాటిని ప్రజలకు పరిచయం చేయాలన్న లక్ష్యంతో జయపురంలో మిరగన్ వస్త్ర కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే వాటిని మార్కెటింగ్ చేసేందుకు విక్రయ దుకాణాలు నెలకొల్పుతున్నట్లు వెల్లడించారు. శిక్షణ పొందిన మహిళలు, మార్కెటింగ్ చేసే మహిళల ఆర్థిక ప్రగతికి దోహద పడగలదని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. జయపురం సమితి బీడీవో శక్తి మహాపాత్రో నూతన కౌశల్యంతో కొట్‌పాడ్ ప్రాంత సంప్రదాయ చేనేతవస్త్ర పరిశ్రమ మిరిగన్ వస్త్రాలకు మరింత బలోపేతం చేసేందుకు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. మిరగన్ వస్త్రాలతో 19 రకాల బర్లికబేగ్ తదితర వస్తువులను తయారు చేసేందుకు శిక్షణ కేంద్రంతో పాటు విక్రయ కేంద్రాలను జయపురం బీడీవో కార్యాలయ ప్రాంగణంలో ప్రారంభించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తోపాటు అతిథులు మిరిగన్ వస్త్రాలను తిలకించారు. కేంద్రం ప్రారంభోత్సవంలో సమితి అధ్యక్షురాలు తిలోత్తమ ముదులి, ఉపాధ్యక్షులు గణేష్ పాఢీ, జయపురం సబ్‌కలెక్టర్ కుమారి అక్కవరం శౌశ్య రెడ్డి, బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారి శక్తి మహాపాత్రో, సీడీపీవో కాంచన పండ, జిల్లా పరిషత్ సభ్యులు త్రిపతి పట్నాయక్‌తోపాటు సమితి సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు. శిక్షణా కేంద్రంలో 45 మంది శిక్షణ పొందేందుకు సౌకర్యాలు ఉన్నాయని బీడీవో శక్తి మహాపాత్రో వెల్లడించారు. శిక్షణ పొందిన మహిళలు తయారు చేసే వస్తువులు విక్రయించేందుకు జయపురం పట్టణంలో ఒక దుకాణం ప్రారంభించనున్నట్లు చెప్పారు.



కేంద్రంలో సిద్ధం చేసిన మిషన్లు



కుట్టు శిక్షణ కేంద్రం



కొట్‌పాడ్ చేనేత వస్త్రంతో తయారు చేసిన బర్లిక బ్యాగులు



మిరగన్ వస్త్రాలను తిలకిస్తున్న కలెక్టర్ తదితరులు

క్లుప్తంగా

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్క నాటి మట్టి వేస్తున్న ఎమ్మెల్యే బాహినీపతి

జయపురం: అడవులు తగ్గిపోవటంతో వాతావరణంలో అనేక మార్పులు జరుగుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయని, దీనిని అరికట్టాలంటే మొక్కలు నాటి సంరక్షించడం ఒక్కటే మార్గమని జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహినీపతి అన్నారు. జయపురం సమితి బొరిగుమ్మలో భైరవ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో 'తల్లి పేరున ఒక చెట్టు' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కళాశాల ఎన్.ఎస్.ఎస్ యూనిట్, భైరవ డిగ్రీ కళాశాల బొరిగుమ్మ, అటవీ విభాగం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటరు నమోదును సరళీకృతం చేయాలి



రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ(ఎం) బృందం

భువనేశ్వర్: ఓటర్ల జాబితాలో నమోదు కోసం ప్రామాణికాలను సరళీకరించాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ (ఎం) ఒడిశా రాష్ట్ర కమిటీ ప్రతినిధి బృందం విన్నవించింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కలిసి వినతిపత్రం సమర్పించింది. అర్హులైన ఓటర్లందరినీ ఓటరు జాబితాలో చేర్చాలని డిమాండ్ చేసింది. జాబితా నుంచి అర్హత ఉన్న పౌరుల్ని మినహాయించే ఏ ప్రయత్నమైనా ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. ప్రతినిధి బృందంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి సురేష్ చంద్ర పాణిగ్రాహి, రాష్ట్ర సంపాదక బోర్డు సభ్యులు దుష్మంత కుమార్ దాస్, యమేశ్వర్ సామంతరాయ్, బద్రీనారాయణ్ దాస్, ఇతర నాయకులు ఉన్నారు.

ప్రయాణికుల బస్సు బోల్తా

- పలువురికి గాయాలు



ప్రమాద దృశ్యం

భువనేశ్వర్: ఢెంకనాల్ జిల్లాలో అదుపు తప్పి ప్రయాణికుల బస్సు బోల్తా పడింది. తుము సింఘా పోలీస్ ఠాణా కొంతియాపుట్ సాహి వద్ద శుక్రవారం ఈ ప్రమాదం సంభవించింది. రోడ్డు పనులు జరుగుతున్న ప్రాంతంలో వర్షాలు కారణంగా మట్టి కూరుకుపోవడంతో ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. సావాండా నుంచి ఢెంకనాల్‌కు వెళ్తున్న ఈ బస్సులో 30 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు. పలువురు ప్రయాణికులు గాయపడ్డారు.

బాబోయ్ పులి!



అటవీ శాఖ గుర్తించిన పెద్ద పులి పాదముద్రలు

భువనేశ్వర్: సుందర్‌గఢ్ జిల్లా లెఫ్రిపడా అటవీ ప్రాంతంలో పెద్ద పులి సంచరిస్తుండటంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. హల్మా పంచాయతీ ధంగెరేగుడి, కుంజునాల ప్రాంతాల్లో పెద్ద పులి సంచరిస్తున్నట్లు భావిస్తూ పులి పాదముద్రలను అటవీ అధికారులు గుర్తించారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో పులి సంచరిస్తున్నట్లు భావిస్తున్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

దేశభక్తిని చాటుకుందాం



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

రాయగడ : ఈ నెల 15న స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జరగనున్న స్వాతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించి దేశభక్తిని చాటుకుందామని జిల్లా అదనపు కలెక్టర్ నవీన్‌చంద్ర నాయక్ పిలుపునిచ్చారు. స్థానిక సమితి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటింటా జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అంతకుముందు జిల్లా కలక్టర్ కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ బసంత కుమార్ ప్రధాన్ పాల్గొన్నారు.



వారపు సంతలో గిరిజన పప్పు దినుసులు అమ్ముతున్న బోండా మహిళలు



ఆంద్రాహల్ వద్ద సంతలో మద్యం అమ్ముతున్న మహిళలు



కొండచీపుర్లను అమ్మకానికి తెస్తున్న వృద్ధురాలు



పర్యాటకులు ఇచ్చిన ఫొటోలు చూపుతున్న బోండా మహిళలు



అటవీ ఉత్పత్తులతో మహిళలు




సీతమ్మ స్నానమాచరించినట్లు భావించే ముదిలిపోడ జలపాతమిదే

విచిత్రం.. విభిన్నం..

బోండా గిరిజన జీవనం

- మల్కన్‌గిరి జిల్లాలో సుమారు ఐదు వేల మంది బోండా జాతి ఆదివాసీలు
- అభివృద్ధి, ఆధునిక జీవన శైలికి దూరం

మల్కన్‌గిరి: ఆదివాసీ గిరిజనులకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే మల్కన్‌గిరి జిల్లాలో బోండా జాతి గిరిజనులు ప్రత్యేకంగా నిలుస్తుంటారు. సముద్ర మట్టానికి సుమారు ఐదు వేల అడుగుల ఎత్తులో ఉన్న బోండాఘాటి ప్రాంతం ఖోయిర్‌పూట్ సమితి ముదిలిపోడ, ఆంద్రాహల్ పంచాయతీల్లో సుమారు ఐదు వేల మంది బోండా జాతి ప్రజలు జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ఇక్కడ అభివృద్ధి మాత్రం మచ్చుకైనా కనిపించదు. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఎవరైనా రోగం బారిన పడితే డోలీ కట్టాల్సిందే. విద్య, వైద్యం, సమాచార వ్యవస్థలు అందని ద్రాక్షలా మారాయి. వరి, చోలు, మామిడి, పనస, మహుల, కుసుమ పూలతో చేసే వంటకాలు వీరికి ఎంతో ఇష్టం. ఇప్పుడిప్పుడే వీరిలో కొందరు యువకులను కొందరు బయట ప్రపంచానికి తీసుకెళ్తున్నారు.



నూకలు విసురుతున్న వృద్ధురాలు

సంక్షేమ పథకాలపై అవగాహన

జయపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సామాజిక సంక్షేమ పథకాలపై జయపురం సమితి టంకువ గ్రామంలో న్యాయ సచేతన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. గ్రామ సభా గృహంలో కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ జయపురం ఆధ్వర్యంలో నిర్వహించన సచేతన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి, ప్రద్యామయ సుజాత హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సామాజిక, ప్రజా సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా నిర్మాణ శ్రామికుల పిల్లల విద్యా సహాయంలో 6, 7 తరగతుల వారికి కోసం ఏడాదికి రూ.2 లక్షలు, 8వ తరగతి వారికి ఏడాదికి రూ.2 లక్షలు, 9వ తరగతి వారికి ఏడాది రూ.3 లక్షలు, 10వ తరగతి వారికి ఏడాదికి రూ.4 లక్షలు సహాయం అందుతుందన్నారు. కార్మికులు సహజ మరణం సంభవిస్తే రూ.2 లక్షలు, ప్రమాదంలో మరణిస్తే రూ.4 లక్షల ఆర్థిక సహాయం అందుతుందని వెల్లడించారు. ఈ సహాయం కేవలం గుర్తింపు పొందిన నిర్మాణ కార్మికుల కుటుంబాల వారికే లభిస్తాయని వెల్లడించారు. ఈ సచేతన శిబిరంలో మృతి చెందిన ఇద్దరు నిర్మాణ కార్మిక కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున జిల్లా లేబర్ విభాగం వారి తరఫున జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి, జయపురం అందజేశారు. జయపురం సమితి సామాజిక సురక్షా విభాగం ద్వారా వృద్ధాప్య పెన్షన్, వితంతువు పెన్షన్‌లు జిల్లా లేబర్ విభాగ అధికారి సబిత కుమారి నాయక్ అందజేశారు. ఈ శిబిరంలో జిల్లా లేబర్ అధికారి, జయపురం సబిత కుమారి నాయక్, డీఈఓ మనోజ్ పాణిగ్రహి, టంకువ గ్రామ పంచాయతీ పీఈఓ రమణి రంజన్ త్రిపాఠీ, సర్పంచ్ రుక్మిణి గదబ, సమితి సభ్యులు శ్యామ పొరజ, తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణ కార్మికుని కుటుంబానికి రెండు లక్షలు చెక్ అందజేస్తున్న సుజాత



వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న జిల్లా లేబర్ అధికారి సబిత కుమారి నాయక్

సమస్యలు పరిష్కరించాలని వినతి

పర్లాకిమిడి: పట్టణంలో అపరిష్కృతంగా ఉన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ మధుమితకు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బసంత పండా అధ్యక్షతన ఆ పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు. పర్లాకిమిడి మున్సిపాల్టీని పాలకులు పట్టించుకోకపోవడంతో ఇరుకైన రోడ్లు, డ్రైనేజీలు సకాలంలో విస్తరణ చేపట్టలేక పోయారన్నారు. పట్టణంలో కోర్టు జంక్షన్ నుంచి మెడికల్ రోడ్డు, మెడికల్ జంక్షన్ నుంచి నీలబంధు, కోర్టు జంక్షన్ వరకు సీసీ రోడ్డు నిర్మించారని, ఎత్తు, పల్లాలు, గంతలు ఏర్పడ్డాయన్నారు. మార్కెట్ జంక్షన్ వద్ద ఉదయం పూట ట్రాఫిక్‌తో హైస్కూల్ జంక్షన్ నుంచి పోలీసు జంక్షన్ వరకు రోడ్డును 66 అడుగుల వెడల్పు చేయాలన్నారు. పర్లాకిమిడి కేంద్ర పెద్దాసుపత్రిలో డాక్టర్ల కొరత వేధిస్తుందని, 126 మంది డాక్టర్లకు ప్రస్తుతం 34 మంది ఉన్నారన్నారు. ఈ.డి.హెచ్.హెచ్ ఆసుపత్రిలో స్పెషలిస్టు డాక్టర్లు లేనందున రోగులను పొరుగున ఉన్న శ్రీకాకుళం, విశాఖకు రిఫర్ చేస్తున్నారన్నారు. పర్లాకిమిడి పట్టణంలో టాటా పవర్ డిస్ట్రిబ్యూషన్ నిర్వహణలో అనేక లోపాలు ఉన్నాయని, పవర్ కట్ ఎప్పుడు పడితే అప్పుడు చేస్తున్నారన్నారు. పట్టణంలో సదారం, పట్నాయక్ చెరువుల అభివృద్ధిలో అవినీతి జరిగిందని, దీనిపై క్రైం బ్రాంచ్ దర్యాప్తు చేయించాలని కోరారు. జిల్లా కలెక్టర్‌ను కలిసిన వారిలో మున్నా పాత్రో, సూర్యనారాయణ పాత్రో, లిఖి పాత్రో, మిట్టు పట్నాయక్ వున్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రభుత్వం దృష్టికి జర్నలిస్టుల సమస్యలు

రాయగడ: జర్నలిస్టులకు సంబంధించిన వివిధ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారం కొసం కృషి చేస్తామని జిల్లా పౌరసంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ బసంతకుమార్ ప్రధాన్ అన్నారు. స్థానిక గాయత్రీనగర్ వద్ద గల సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో శుక్రవారం స్టేట్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఎస్‌యూజే) రాయగడ శాఖ అధ్యక్షుడు శివ నారాయణ గౌడొ ఆధ్వర్యంలో జరిగిన సంఘం కార్యవర్గ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత్రికేయుల సంక్షేమం కోసం ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ పథకాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నామన్నారు. పాత్రికేయులు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సమస్యల గురించి చర్చించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర శాఖ కార్యనిర్వాహక అధ్యక్షుడు కీర్తి చంద్ర సాహు మాట్లాడుతూ పాత్రికేయుల హక్కులు, భద్రత వంటి వాటిపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం సాధారణ కార్యదర్శి సుభాష్ చంద్ర సూర్య, సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన్‌ను సంఘం సభ్యులు సత్కరించారు.



బసంత కుమార్ ప్రధాన్‌ను సత్కరిస్తున్న సంఘం సభ్యులు

గజపతి మహారాజు విగ్రహం ఏర్పాటుచేయాలి



మున్సిపల్ ఈఓకు వినతిపత్రం అందిస్తున్న ఉత్కళ సమ్మేళని సభ్యులు

రాయగడ: పర్లాకిమిడి మహారాజ కృష్ణ చంద్ర గజపతి నిలువెత్తు విగ్రహాన్ని పట్టణంలో ఏర్పాటు చేయాలని ఉత్కళ సమ్మేళని రాయగడ శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు శాఖ సభ్యులు రాయగడ మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి కులదీప్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. స్వతంత్ర ఒడిశా ఆవిర్భావానికి గజపతి మహారాజు చేసిన సేవలు వివరించారు. గజపతి కూడలిలో పాత విగ్రహాన్ని తొలగించి దాని స్థానంలో సరికొత్త నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన అధికారి త్వరలో జరిగే మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో విషయాన్ని ప్రస్తావించి అందరి ఆమోదంతో ఆచరణ రూపం దాల్చేలా చేస్తానని హామీ ఇచ్చారు. ఉత్కళ సమ్మేళని రాయగడ శాఖ అధ్యక్షులు బ్రజసుందర్ నాయక్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో సభ్యులు,పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



యువతి మృతిపై దర్యాప్తు చేపట్టాలని ఎస్పీకి అభ్యర్థించిన ప్రతినిధి బృందం

భువనేశ్వర్: కేంద్రాపడా జిల్లా పట్టాముండై ప్రాంతంలో అవమానకర పరిస్థితుల్లో ఆత్మాహుతికి పాల్పడిన సంఘటనకు సంబంధించి బిజూ జనతా దళ్ ప్రతినిధి బృందం ఘటనా స్థలాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని ఓదార్చి స్థానిక పోలీసు సూపరింటెండెంట్‌తో సంప్రదించింది. బ్లాక్ మెయిల్ ప్రసారాలు తాళలేక విద్యార్థిని ఆత్మాహుతికి పాల్పడినట్లు ప్రధాన ఆరోపణ. ఈ సంఘటనపై దర్యాప్తు చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని విపక్ష ప్రతినిధి బృందం ఎస్పీని కోరింది. పట్టాముండైలో చోటు చేసుకున్న ఈ విచారకర సంఘటన రాష్ట్రంలోని వినాశకరమైన శాంతిభద్రతలకు నిలువెత్తు ఉదాహరణగా బిజూ జనతా దళ్ పేర్కొంది. పోలీసు వ్యవస్థ బలహీనతతో ఇటువంటి దారుణం జరిగింది. ఈ సంఘటనపై దర్యాప్తును వెంటనే క్రైమ్ శాఖకు అప్పగించాలని కోరారు.



బాధిత కుటుంబాన్ని ఓదార్చిన బీజేడీ ప్రతినిధి బృందం

నేడు జయపురానికి సీఎం రాక

జయపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహాణ చరణ మఝి శనివారం జయపురం వస్తున్నారు. దీంతో అధికారులు అందుతగ్గ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆ ఏర్పాట్లను కొరాపుట్ జిల్లా కలెక్టర్ మనోజ్ సత్యబాన్ మహాజన్, జయపురం సబ్ కలెక్టర్ కుమారి అక్కవరం శౌశ్య రెడ్డి, ఎస్పీ తదితరులు బంకబిజ మైదానంలో ఏర్పాట్లు శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. జయపురం సమీపంలో బంకబిజ మైదానంలో నిర్వహించబడే సభా కార్యక్రమంలో సుభద్ర పథకంలో మూడవ విడత పైకాన్ని లబ్ధిదారులైన మహిళలకు అందజేస్తారు. అందుకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దాదాపు 20 వేల మంది ప్రజలు పాల్గొనేందుకు వీలుగా మూడు పెండాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రజల కోసం భోజన, శౌచాలయ, తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ప్రభాత్ పారిడ, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటారని అధికారులు తెలిపారు.



ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్, సబ్‌కలెక్టర్ తదితరులు

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

రాయగడ: భారతీయ మజ్దూర్ సంఘ్ రాయగడ శాఖ ఆధ్వర్యంలో కొలనార సమితి అమాలాభట్ట సమీపంలో గల హనుమాన్ మందిరం ప్రాంగణంలో శుక్రవారం మొక్కలు నాటారు. సంఘం రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు జీగేశ్వర్ దాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పర్యావరణ పరిరక్షణతోపాటు అంతరిస్తున్న ఔషధ గుణాలు గల వృక్ష సంపదను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. విలువైన ఔషధ గుణాలున్న మొక్కలు నాటాలన్నారు. భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా శాఖ కార్యనిర్వాహక అధ్యక్షుడు ధర్మసింగ్ నాగ్, కార్యదర్శి గణేష్ కుమార్ సాహు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సభ్యులు పాల్గొని ఉసిరి, వేప తదితర ఔషధ మొక్కలను నాటారు.

ఉపాధ్యాయుల ధర్నా



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఓస్టా ఉపాధ్యాయులు సంఘం సభ్యులు

పర్లాకిమిడి: ప్రభుత్వ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ శుక్రవారం ఒడిశా స్కూల్ టీచర్స్ ఉద్యోగుల సమన్వయ కమిటీ (ఓస్టా) కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టింది. జిల్లాలో సిద్ధమణుగు (కాశీనగర్)లోని చాందిపుట్, మోహానాలో దమ్మాదువా ఉన్నత పాఠశాలల్లో మొత్తం 194 ఉపాధ్యాయులకు పెన్షన్, గ్రాట్యూటీ ఇతర సౌకర్యాలు లేకుండా పనిచేస్తున్నారని ఓస్టా కార్యదర్శి చిత్తరంజన్ పండా అన్నారు. ప్రభుత్వ గ్రాంట్ ఇన్ ఎయిడ్ మాధ్యమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులుకు ప్రభుత్వం ఆమోదం తెలపాలని, రిటైర్‌మెంట్ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని, 25 సంవత్సరాలు పనిచేసిన ఉపాధ్యాయులకు పింఛన్ మంజూరు చేయాలన్నారు. 7వ వేతన సంఘం 2017లో అమలైనా మాధ్యమిక ఉపాధ్యాయులకు అందడం లేదన్నారు. రాష్ట్రంలో ఈవిధంగా 30వేల మంది ఉపాధ్యాయులు ఉన్నారని, అన్ని పాఠశాలల్లో గ్రాంట్ ఇన్ ఎయిడ్ పాఠశాలలను కళాశాలలుగా గుర్తించాలని ఓస్టా అధ్యక్షుడు పి.మేనకారావు డిమాండ్ చేశారు. మధ్యాహ్నం కలెక్టర్ మధుమితకు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లను సకాలంలో పరిష్కరించకుంటే రాష్ట్ర రాజధానిలోని పి.ఎం.జి చౌక్‌లో నిరవధిక సమ్మెను చేపడతామన్నారు. ఈ ఆందోళనలో జిల్లాలోని మోహానా, ఆర్.ఉదయగిరి, నువాగడ, గుసాని, కాశీనగర్‌లలో పనిచేస్తున్న, రిటైర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ పూజలు



రాయగడ: కుంకుమ పూజల్లో మహిళలు



రాయగడ: పూజలందుకున్న మహాలక్ష్మీ అమ్మవారు

రాయగడ: శ్రావణమాసంలో అతి ప్రాముఖ్యత గల రోజైన మూడో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇంటింటా అమ్మవారికి ప్రత్యేక పూజలను మహిళలు చేశారు. రాయగడలోని స్థానిక బ్రాహ్మణవీధి సమీపం ఉన్న కోదండరామ మందిరంలో కుంకుమ పూజలు ప్రధాన అర్చకులు అనంత ఆచార్యుల ఆధ్వర్యంలో కొనసాగాయి. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పర్లాకిమిడిలో..

శ్రావణ శుక్రవారం సందర్భంగా స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో సాయంత్రం వరలక్ష్మి వ్రతాలను వైభవంగా నిర్వహించారు. 50 మంది ముత్తైదువులతో పసుపుకుంకుమ పూజలను పర్లాకిమిడి: వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో వరలక్ష్మి పూజలు ప్రధాన పూజారి వనమాలి మణిశర్మ గావించారు. అలాగే ఉదయం ఉమారామలింగేశ్వర ఆలయంలో పార్వతీదేవి, లలితాదేవి ఆలయాలలో పూజారి దుర్గాబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక కుంకుమ పూజలు చేయించారు. భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి ముత్తైయిదువులకు చీరలు, తాంబూలాలు అందజేశారు.



పర్లాకిమిడి: వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో వరలక్ష్మి పూజలు



పర్లాకిమిడి: ప్రత్యేక అలంకరణ కన్యకాపరమేశ్వరీదేవి

క్లుప్తంగా

ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న క్లూస్‌టీమ్, పోలీస్ సిబ్బంది

గజపతినగరం రూరల్: నియోజకవర్గ కేంద్రం లోని పురిటిపెంట మామిడిబంద కాలనీలో నివాసముంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు బెహరా వెంకటకృష్ణ శేఖర్ ఇంట్లో గురువారం చోరీ జరిగిందని గజపతినగరం ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. చోరీ జరిగిన ప్రదేశాన్ని క్లూస్ టీంతో పరిశీలన చేసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. శేఖర్ దంపతులు ఉద్యోగస్తులు కావడంతో ఉదయం 8గంటలకే విధులకు వెళ్లిపోయి సాయంత్రం వారు ఇంటికి చేరేసరికి తలుపుల తాళాలు తీసి బీరువాలో వస్త్రాలన్నీ చిందరవందరగా పడి ఉండడంతో చోరీ జరిగినట్లు తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ చోరీలో సుమారు ఐదు తులాల బంగారం, రూ.50వేలు నగదు అపహరణకు గురయ్యినట్లు ఇంటి యజమాని శేఖర్ తెలిపారని చెప్పారు. క్లూస్ టీమ్ రంగంలోకి దిగి అన్ని ఆధారాలు సేకరించినట్లు తెలిపారు.

రెండు లారీలు ఢీకొని వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన లారీ డ్రైవర్

బొండపల్లి: మండలంలోని బిల్లలవలస గ్రామం జంక్షన్‌లో జాతీయ రహదారి 26పై రెండు లారీలు ఢీ కొనడంతో జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి బాయిల్డ్ రైస్ లోడుతో విశాఖపట్నం వెళ్తున్న లారీని విశాఖపట్నం నుంచి ఒడిశా వెళ్తున్న ఐరన్ లోడు లారీ ఢీ కొనడంతో బియ్యం లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్ రెండు లారీల మధ్యన ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతి చెందిన డ్రైవర్‌ను మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సందీప్‌గా గుర్తించినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి పోలీసులు తరలించారు.

బస్సు ఢీకొని మహిళకు గాయాలు



కాంప్లెక్స్ ఇన్ గేట్ వద్ద మహిళను ఢీకొన్న బస్సు

విజయనగరం క్రైమ్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఓ మహిళ గాయపడింది. కాంప్లెక్స్ ఇన్ గేట్ వద్ద పండ్లు కొంటూ స్కూటీపై ఉన్న మహిళను విశాఖ నుంచి వస్తున్న ఎక్స్‌ప్రెస్ బస్సు ఎడమవైపు ఢీ కొట్టి ఆమె కాలిపై నుంచి బస్సు వెళ్లడంతో ఆ మహిళ తీవ్రంగా గాయపడింది. దీంతో అక్కడే ట్రాఫిక్ అవుట్ పోస్ట్ వద్ద ఉన్న ఏఎస్సైలు రాజు, రాంబాబు, హెచ్‌సీ అప్పారావులు వెంటనే 108కు ఫోన్ చేసి బాధిత మహిళను చికిత్స కోసం సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌ల నివేదిక తీసుకుని వన్ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

సర్వజన ఆస్పత్రిలో ఫార్మసిస్టుల కొరత..!

- ఏడాదిన్నరగా పోస్టులు ఖాళీ
- భర్తీ చేయని ప్రభుత్వం
- ప్రస్తుతం ఉన్నది 10 మంది
- మరో 15 మంది అవసరం



సర్వజన ఆస్పత్రి ఫార్మసీ విభాగం వద్ద అధిక సంఖ్యలో మందుల కోసం నిరీక్షిస్తున్న రోగులు



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఫార్మసిస్టులు (ఫార్మసీ ఆఫీసర్లు) పూర్తిస్థాయిలో లేక పోవడంతో రోగులకు సక్రమంగా సేవలు అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్న వారిపైనే అధిక భారం పడుతుండడంతో ఇబ్బంది పడుతున్నారు. జిల్లా ఆస్పత్రి నుంచి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిగా మారిన నేపథ్యంలో స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ సేవలు కూడా పెరిగాయి. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య కూడా పెరిగింది. రోగులకు చికిత్స అందించే వైద్యుల తర్వాత అంతటి ప్రాధాన్యం ఫార్మసిస్టులకు ఉంది. వైద్యులు రాసి ఇచ్చిన మందులు అందించేంది ఫార్మసిస్టులే. అయితే వారి సంఖ్య ప్రస్తుతం తక్కువగా ఉంది. రోగుల సంఖ్యకు తగ్గట్టు ఫార్మసిస్టులను నియమించడంలో కూటమి సర్కార్ అలసత్వం వహిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఏడాదిన్నరగా భర్తీ కాని ఖాళీలు

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో 11 మంది ఫార్మసిస్టులు ఉండేవారు. వారిలో ఒకరు ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఏడాదిన్నరగా ఆపోస్టు ఖాళీగా ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం భర్తీ చేయకుండా మీనమేషాలు లెక్కిస్తోంది.

మరో 15మంది అవసరం

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ప్రస్తుతం 10 మంది ఫార్మసిస్టులు ఉన్నారు. ఆస్పత్రిలో రోగులకు పూర్తిస్థాయిలో సేవలు అందించడానికి ఇంకా 15 మంది వరకు ఫార్మసిస్టులు అవసరం. జిల్లా ఆస్పత్రిగా ఉన్నప్పుడు ఆస్పత్రికి 500 నుంచి 600 వరకు ఓపీ వచ్చేది. ఇప్పుడు 1200 నుంచి 1400 వరకు ఓపీ వస్తోంది. 24 గంటల పాటు ఫార్మసిస్టులు సేవలు అందించాల్సి ఉంటుంది. మూడు షిఫ్టుల్లో ఫార్మసిస్టులు సేవలు అందిస్తారు.

సర్వజన ఆస్పత్రిలో ఓపీ వివరాలు

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఎన్‌సీడీ, ఈఎన్‌టీ, డెంటల్, పలమనాలజీ, న్యూరో మెడిసిన్, న్యూరో సర్జరీ, నెఫ్రాలజీ, యురాలజీ, ఎముకలు, చర్మ, మానసిక, ఏఆర్‌టీ, అంకాలజీ, కంటి విభాగాలు ఉన్నాయి.

గత ప్రభుత్వంలో వెకెన్సీ ద్వారా పోస్టుల భర్తీ

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేశారు. వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా వైద్య రంగంలో 50 వేలకు పైగా పోస్టుల భర్తీ జరిగింది. పీహెచ్‌సీ నుంచి జిల్లా ఆస్పత్రి వరకు ఏ ఆస్పత్రిలోనైనా పోస్టు ఖాళీ అయితే వెంటనే నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేసేవారు. కాని ఇప్పుడా పరిస్థితి లేదు. పోస్టు ఖాళీ అయితే ఏడాదిన్నర అయినా భర్తీ చేసిన దాఖలాలు లేవు.

పిల్లల జీవితం.. తీర్చిదిద్దుదాం



కొట్టక్కి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంచి నడవడికపై సూచనలు చేస్తున్న ఉపాధ్యాయుడు

- వ్యక్తిత్వ వికాసంలో గురువు, తల్లిదండ్రుల పాత్ర కీలకం
- జాగ్రత్తలు పాటించాలని విద్యావేత్తల సూచన



కొట్టక్కిలో తన కుమార్తెను పాఠశాలకు తీసుకువెళ్తున్న తల్లి



పాఠశాలకు పంపించేందుకు బాబును సిద్ధం చేస్తున్న తల్లి

రామభద్రపురం: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యా రంగానికి ఉన్న ప్రాధాన్యం మరోదానికి లేదు. అయితే విద్యారంగంలో రాణించాలంటే విద్యార్థులపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ఎక్కువ బాధ్యత ఉంటుంది.బడిలో చేర్పడంతోనే బాధ్యత ముగిసిందని తల్లిదండ్రులు, పాఠాల బోధనతో సరి అని ఉపాధ్యాయులు అనుకుంటే పొరపాటే, కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. పిల్లలను ఉదయాన్నే నిద్ర లేపడం..వారిని బుజ్జగించి పాఠశాలలకు పంపడం ప్రతిరోజూ చేయాల్సిందే. శైశవ దశలో పెంపకం, తల్లిదండ్రుల ప్రవర్తన, పిల్లలతో వ్యవహరించే విధానం, పిల్లలపై వారు చూపే ప్రేమ, ఆప్యాయత, రక్షణ ఇలా అన్ని తగినంత నిర్మాణాత్మకంగా ఉంటేనే పిల్లల ప్రవర్తన బాగుంటుంది. లేదంటే మొండితనం, సిగ్గు, మొహమాటం, బిడియం వంటి ప్రవర్తనా సమస్యలకు కారణమవుతుందని నిపుణులు చెబుతున్నారు. చిన్నారుల సంరక్షణలో బడి చదువుల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

తల్లిదండ్రుల బాధ్యతలు..

- తల్లిదండ్రులు పిల్లలపై వాత్సల్యం చూపించాలి.వారి ఎదుట గొడవ పడడం, ఒకరినొకరు నిందించుకోవడం వంటివి చేయకూడదు.
- విద్యార్థులు పెద్దలతో పాటు స్నేహితులను అనుకరిస్తారు.కుటుంబ సభ్యులు వారికి ఎల్లప్పుడూ మార్గదర్శకంగా ఉండాలి.
- పిల్లలను ద్వేషించడం, కసురుకోవడం, దగ్గరికి రానీయకపోవడం చేయరాదు.
- ఇంటి వద్ద చదువుకునేందుకు అనుకూలమైన వాతావరణం కల్పించాలి.
- ఆడ,మగ పిల్లలను తేడాగా చూడకుండా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలి.
- టీవీలు, సెల్‌ఫోన్లు, కంప్యూటర్ ఆటలు మంచివి కావు. వాటిని పరిమితంగా వాడేలా, చెడుస్నేహం , వ్యసనాల బారినపడకుండా చూడాలి.

ఉపాధ్యాయుల బాధ్యతలు..

- బడిలో స్నేహపూర్వక వాతావరణం కల్పించాలి.
- అ..ఆ..ఇ..ఈ లైనా,ఏబీసీడీలైనా ఎక్కాలైనా,లెక్కలైనా అవగాహనతో కూడిన పునాది ఏర్పడేలా బోధన చేయాలి. అక్షరంపై పట్టు లేకపోతే పాఠాలు చదవ లేరు. అక్షరంపై పట్టు సాధించేలా బోధన చేయాలి.
- చదువు ప్రాముఖ్యం, సమయపాలన ప్రాధాన్యం గురించి పిల్లలకు తెలియజేసి పాఠ్యాంశాలపై ఏకాగ్రత అలవర్చాలి.
- బడిలో ఉపాధ్యాయులు నీతికథలు, సూక్తులు, ఇతివృత్తాలు, తెలియజేసి నైతిక విలువలు పెంపొందించాలి.ఆట పాటలతో బోధిస్తూ పిల్లలను ఆకట్టుకోవాలి.

నాన్న బాధ్యత..



ఉదయాన్నే లేచి పిల్లల్ని పాఠశాల వద్ద దింపి రావడమే తమ బాధ్యత అనుకునే తల్లిదండ్రులు ఎంతో మంది ఉన్నారు.అవసరమైతే పుస్తకాలు,పెన్నులు కొనివ్వడాన్ని అదనపు బాధ్యతగా భావిస్తారు.అలా కాకుండా సాయంత్రం పిల్లలు ఇంటికి రాగానే తండ్రి వారితో చక్కగా సంభాషించాలి.పిల్లల చదువుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలి.తల్లి కుటుంబ అంశాలపై అవగాహన పెంచితే తండ్రి పోటీ ప్రపంచంలో నెగ్గుకొచ్చే తీరును నేర్పించాలి.

– సీహెచ్ తిరుపతిరావు,ఉపాధ్యాయుడు.

గురువు బాధ్యత..



విద్యార్థికి జీవితాన్ని నేర్పించేది గురువే. పోటీ ప్రపంచంలో గట్టెక్కేవాడు విజేత.ఆ దిశగా విద్యార్థిని తీర్చిదిద్దడంలో గురువుదే బాధ్యత.మూస పద్ధతిలో కాకుండా సబ్జెక్టులతో పాటు సమాజం గురించి వినూత్న రీతిలో బోధించాలి.ప్రతి విద్యార్థిపైనా దృష్టిపెట్టాలి.సమకాలీన ప్రపంచంలో వస్తున్న మార్పుల్ని వారు ఔపోసన పట్టాలి.వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి.అప్పుడే విద్యార్థుల ఉజ్వల భవితకు దిక్సూచి కాగలరు. –యు మాణిక్యంనాయుడు, డీఈవో, విజయనగరం

అమ్మ పాత్ర..



వ్యక్తిత్వ నిర్మాణంలో అమ్మ పాత్ర కీలకం.ఉదయమే నిద్రలేపడం,పిల్లలకు ఇష్టమైన మెనూ సిద్ధం చేయడం ,పుస్తకాలు సర్ది పాఠశాలకు పంపడం వరకు క్షణం తీరికలేనిది.ఇది రొటీన్‌గా మారకుండా చిన్నారుల్ని చదువులో మమేకం చేసేందుకు వీలున్న అంశాలపై తల్లులు అవగాహన పెంచుకోవాలి.పాఠశాల నిబంధనలు మేరకు పెన్సిళ్లు, పెన్నులు,స్కేళ్లు రబ్బర్లు చూడడానికి ఇవి చిన్నవే అన్నట్లు కనిపిస్తాయి.ఇందులో ఏ ఒక్కటి లేకున్నా తరగతి గదిలో పిల్లలు ఇబ్బంది పడక తప్పదు. వాటిని తప్పకుండా బ్యాగులో ఉంచాలి.ఉన్నత తరగతికి వెళ్తున్నారు కదా అని సరిపెట్టుకోకుండా పాత పుస్తకాల్లోని అంశాలను పిల్లల చేత ఒకసారి పునశ్చరణ చేయించాలి.

– ఎం.దీప, కేజీబీవీ ప్రిన్సిపాల్, బూసాయవలస

భామినిలో శ్వేతనాగు దర్శనం



దర్శనమిచ్చిన శ్వేతనాగు



మల్లేసు ఇంటిలోని వంట గదిలో తెల్లనాగు

భామిని: మండల కేంద్రంలో శుక్రవారం శ్వేతనాగు దర్శనమిచ్చింది. తెల్లగా మెరుస్తున్న నాగు పాము అగతముడి మల్లేసు అనే రైతు ఇంట ప్రవేశించింది.శ్రావణ శుక్రవారం రోజున శ్వేతనాగు దర్శనం శుభ పరిణామమని గ్రామస్తులు విని తండోప తండోలుగా తరలివచ్చి దర్శనం చేసుకున్నారు. ప్రజల హడావిడితో శ్వేతనాగు మల్లేసు ఇంటి పెరడులోని కూరగాయల పాదలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా గ్రామస్తులు శ్వేతనాగుకు పాలు పోసి మొక్కులు తీర్చారు.

6 తులాల బంగారు ఆభరణాల అప్పగింత



బంగారాన్ని ఫిర్యాదు దారు రాలికి అప్పగిస్తున్న ఎస్సై సురేంద్ర నాయడు

విజయనగరం క్రైమ్: విజయనగరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ క్రైమ్ పార్టీ సిబ్బంది ఫిర్యాదు అందిన కొద్ది గంటల వ్యవధిలోనే పోయిన బంగారాన్ని స్వాధీనం చేసుకుని బాధితురాలికి శుక్రవారం అప్పగించారు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. విజయనగరంలోని కామాక్షి నగర్ కు చెందిన పిల్ల పద్మ సొంత పని నిమిత్తం ఈనెల 7న సాయంత్రం కామాక్షినగర్ వద్ద ఆటో ఎక్కి నగరంలోని రైల్వే స్టేషన్ వద్ద దిగింది. ఆటోలో బ్యాగు మర్చిపోయినట్లు గుర్తించి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సీఐ ఆర్వీఆర్కే చౌదరి ఆదేశాలతో స్టేషన్ క్రైమ్ ఎస్సై సురేంద్ర నాయుడు, సిబ్బంది శ్రీను, రమణలు ఆటోను సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా ట్రేస్ చేశారు. ఆటో వెనక సీటు భాగంలో బ్యాగ్‌ను గుర్తించడంతో పాటు అందులో ఆరు తులాల బంగారు ఆభరణాలను ఫిర్యాదురాలైన పిల్ల పద్మకు అప్పగించారు. బ్యాగును, విలువైన బంగారు ఆభరణాలను అప్పగించడంలో క్రియాశీలకంగా పని చేసిన ఎస్సై సురేంద్ర నాయుడు, సిబ్బందిని సీఐ చౌదరి అభినందించారు.

వంగర తహసీల్దార్ సస్పెన్షన్

- విచారణ అధికారిగా కేఆర్‌సీ ఎస్‌డీసీ
- ఇన్‌చార్జ్‌గా రాజాం తహసీల్దార్‌కు అదనపు బాధ్యతలు

విజయనగరం అర్బన్/వంగర: వంగర ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్.రమణారావుపై సస్పెన్షన్ విధిస్తూ కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రమణారావు విధి నిర్వహణలో ఉండగా కార్యాలయంలోనే మద్యం తాగినట్లు వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చిన కథనాల నేపథ్యంలో కలెక్టర్ ఈ ఆదేశాలను జారీ చేశారు. వంగర మండలానికి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా రాజాం తహసీల్దార్‌కు అదనపు బాధ్యతలను అప్పగించారు. అదే విధంగా ఈ వ్యవహారంపై విచారణాధికారిగా కేఆర్‌సీ ఎస్‌డీసీ మురళిని నియమిస్తూ ఆదేశాల్లో కలెక్టర్ పేర్కొన్నారు.

రహదారి భద్రతకు ప్రత్యేక డ్రైవ్

- ఎస్పీ వకుల్ జిందల్



కార్యక్రమాలను వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: రహదారి భద్రతను దృష్టిలో పెట్టుకుని, రోడ్డు ప్రమాదాలను నియంత్రించడమే లక్ష్యంగా ఈ నెలలో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు ఎస్పీ వకుల్‌జిందల్ శుక్రవారం తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, హెల్మెట్ ధారణ, బ్లాక్ స్పాట్స్ వద్ద ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు నమోదు చేసేందుకు, ఈ చలానాలు విధించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అధికారులను ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాలతో రహదారి భద్రతకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామన్నారు.

టిడ్కో గృహాలకు గ్రహణం

- కూటమి పాలనలో ముందుకు సాగని ఇళ్ల నిర్మాణం
- రాజన్నదొర కృషితో సాలూరులో తొలిసారిగా.. టిడ్కో ఇళ్ల గృహప్రవేశాలు



గతంలో టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవాలు చేస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి రాజన్నదొర



టిడ్కో ఇళ్లు



గతంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడిక రాజన్నదొర

సాలూరు: గ్రామాలతో పోలిస్తే పట్టణాల్లో సొంత ఇల్లు అంటే పేద, మధ్య తరగతి కుటుంబాలకు చాలా కష్టమైన పని. అటువంటి పేదవాడి సొంతింటి కలను సాలూరు పట్టణంలో సాకారం చేసిన అంశంలో మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర చెరగని ముద్ర వేసుకున్నారు. ఓ వైపు టిడ్కో ఇళ్లతో పాటు మరోవైపు నెలిపర్తి, గుమడాం తదితర ప్రాంతాల్లో ఇండ్ల స్థలాలు మంజూరు చేయించి పేదవాడికి సొంత గూడుకు తనవంతు భగీరథ ప్రయత్నం చేశారు.

గతం ఘనం-నేడు దైన్యం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో శరవేగంగా జరిగిన టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు తుది దశ మౌలిక వసతుల పనులు పూర్తిచేయాల్సి ఉండగా ఎన్నికల కోడ్ అమలు కావడంతో పనులు నిలిచిపోయాయి. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పాలనలో టిడ్కో గృహాల నిర్మాణాల విషయంలో అలసత్వం ప్రదర్శిస్తోందని ప్రజలు నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది పాలనలో టిడ్కో గృహాల నిర్మాణాలపై పాలకులు, అధికారులు కన్నెత్తి చూసిన దాఖలాలు లేకపోవడం ఈ విమర్శలకు బలం చేకూరుస్తోంది. ఉమ్మడి విజయనగరంలో జిల్లాలోనే టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి ప్రజలకు అందించి గృహప్రవేశాలు జరిగింది సాలూరు నియోజకవర్గంలోనే కావడం విశేషం.

రూ.82.85 కోట్లతో ఇళ్ల నిర్మాణం

టిడ్కో ఇళ్ల నిర్మాణాలు రూ.82.85 కోట్లతో పూర్తయ్యాయి. ఇందులో 2014–19 మధ్య గత టీడీపీ ప్రభుత్వంలో పునాదులు అంతకన్నా తక్కువ దశలో నిర్మాణాలు చేసి వదిలేయగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.70.28 కోట్లు ఖర్చు పెట్టి ఇళ్లతో పాటు మౌలిక వసతులు కల్పించింది.

రివర్స్ టెండరింగ్ ద్వారా

కేవలం పునాదులు అంతకంటే తక్కువ స్థాయి దశలో నిర్మాణంతో 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వం విడిచిపెట్టిన సాలూరు టిడ్కో ఇళ్లకు గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో రివర్స్ టెండరింగ్ జరిగింది.1 చదరపు అడుగుకు నాటి టీడీపీ ప్రభుత్వం రూ.2,200లకు టెండర్లు పిలవగా, రివర్స్ టెండరింగ్ ద్వారా గత జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రూ.1,700లకే టెండర్లు పిలిచి నిర్మాణం చేపట్టారు.

ఒక్కక్కరి తలపై రూ.7లక్షల అప్పు

గతంలో 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వం టిడ్కో గృహాల లబ్ధిదారుల తలపై సుమారు రూ.7లక్షలు అప్పు పెట్టాలని చూస్తే, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి సుమారు రూ.10 లక్షల విలువైన మౌలిక వసతులతో కూడిన ఇళ్లను ఉచితంగా అందించారని పలువురు లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేసిన దాఖలాలు ఉన్నాయి.

పనులు పూర్తి చేయాలి

కూటమి ప్రభుత్వంలో నేటికీ పనులు పూర్తిచేయలేదని, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉన్నాయని పలువురు ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా పాలకులు, అధికారులు స్పందించి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దాదాపు పూర్తయిన ఈ టిడ్కో గృహాలకు మౌలిక వసతులు పనులు పూర్తి చేయించాలని కోరుతున్నారు.

10న జిల్లా స్థాయి యోగా పోటీలు



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మజ్జి శశిభూషణరావు

విజయనగరం అర్బన్: జిల్లా స్థాయి యోగా పోటీలను ఈ నెల 10న స్థానిక మెసానిక్ టెంపుల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్నామని విజయనగరం జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మజ్జి శశిభూషణరావు ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. పోటీల షెడ్యూల్ బ్రోచర్‌ను ఆయన విడుదల చేశారు. జిల్లాలో ప్రతిభ చూపిన విజేతలు రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీలకు ఎంపికవుతారని పేర్కొన్నారు. పోటీలు 10 నియోజకవర్గాల్లో, 10 నుంచి 55 సంవత్సరాల వయస్సు గల పురుషులు, మహిళల కేటగిరిల్లో ఉంటాయని తెలిపారు. పోటీలు ఆ రోజు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. పోటీల పూర్తి వివరాల కోసం ఫోన్ 7702134568నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రకటన విడుదల చేసిన వారిలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వడ్లమాని నరసింహమూర్తి, కోశాధికారి పి.సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ డి.శివ తదితరులు ఉన్నారు.

ఎత్తిపోతలకు చేతులెత్తేశారు..!

- వరినారు ముదురుతున్నా అందని సాగునీరు
- ఆవేదనలో రైతన్న
- కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆగ్రహం
- తక్షణమే జంఝావతి ఎత్తిపోతల పథకం నుంచి నీరు సరఫరా చేయాలని డిమాండ్



సాగునీరు అందక రాజ్యలక్ష్మీపురంలో సాగుకు నోచుకోని పొలాలు



జంఝావతి ఎత్తి పోతల పథకం

కొమరాడ: జంఝావతి నదిపై 1975లో తలపెట్టిన ప్రాజెక్టు ఒడిశాతో ఉన్న చిన్నపాటి వివాదంతో నిలిచిపోయింది. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి కృషితో 2006లో జంఝావతిపై రబ్బర్‌డ్యామ్ ఏర్పాటైంది. సుమారు 12వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోంది. అక్కడే లో లెవల్ కెనాల్ నుంచి కుడికాలువ పరిధిలోని సుమారు 1000 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఎత్తిపోతల పథకం నిర్మించారు. అప్పటి నుంచి ఏటా జూలై నెలలో ఎత్తిపోతల పథకం నుంచి సాగునీరు అందించేవారు. అయితే, ఈ ఏడాది వర్షాలు అనుకూలించకపోవడం, ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించేందుకు అధికారులు, పాలకులు చొరవచూపకపోవడంతో రాజ్యలక్ష్మీపురం, రావికర్రవలస, కుమ్మరిగుంట, కందివలస తదితర గ్రామాల్లోని భూములు సాగుకునోచుకోలేదు. ఓ వైపు వరినారు ముదిరిపోతున్నా ఎత్తిపోతల పథకం నుంచి సాగునీరు విడుదలకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోకపోవడంపై రైతులు మండిపడుతున్నారు.

ఎత్తిపోతల పథకంపై నిర్లక్ష్యం...

జంఝావతి ఎత్తిపోతల పథకం నిర్వహణపై నిర్లక్ష్యం చూపుతున్నారన్నది రైతుల వాదన. మరమ్మతులకు గురైన మోటార్లను సకాలంలో బాగుచేయకపోవడం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలతను తొలగించకపోవడం వల్లే ఎత్తిపోతల పథకం నుంచి నీరు ఇప్పటికీ విడిచిపెట్టలేదని ఆరోపిస్తున్నారు. గతంలో ఈ పరిస్థితి ఉండేదికాదని, పథకంలో ఏ సమస్య ఎదురైనా వెంటనే పరిష్కరించేవారని చెబుతున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే కనీసం రైతుల గురంచి, పంటల సాగు గురించి పట్టించుకోవడంలేదని వాపోతున్నారు.

జీపుదిగి రేషన్ సరుకుల కోసం నేరళ్లవలస డిపోకు వస్తున్న గిరిజనులు



ఉచిత బియ్యానికి రూ.200 ఖర్చు

చిత్రంలో జీపు దిగి వస్తున్నవారంతా ఆంధ్రా–ఒడిశా సరిహద్దులోని వివాదాస్పద కొటియా గ్రూపు గ్రామాల గిరిజనులు. రేషన్ తీసుకోవాలంటే కొండలపై నుంచి దిగి దండిగాం, నేర్లవలస, కురుకూటి డిపోలకు రావాల్సిందే. దీనికోసం ప్రయాణ ఖర్చుల కింద రూ.100, బియ్యం మూటకు రూ.100 చెల్లిస్తున్నట్టు లబ్ధిదారులు వాపోయారు. ఎండీయూ వాహనాలతో సరుకుల పంపిణీని కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో డిపోల్లో ఇచ్చే ఉచిత బియ్యం తీసుకెళ్లేందుకు ప్రతినెలా రూ.200 ఖర్చు అవుతోందని, ఒక రోజంతా పనిపోతోందని వాపోయారు. – సాలూరు రూరల్



రేషన్ సరుకుల కోసం క్యూలో నిల్చున్న కొటియా గ్రామాల గిరిజనులు